క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

నెహ్రూనగర్: వేసవిలో ప్రయాణికులకు, ప్రజలకు దాహం తీర్చేందుకు గుంటూరు నగరంలో 35 చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల తెలిపారు. శుక్రవారం హిందూ కాలేజీ జంక్షన్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలసి ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన సెంటర్లు, బస్ స్టాండ్ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసి, అందులో తాగునీటిని అందించడానికి ఒకరు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే 35 ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని, అవసరమైతే మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఈ మధుసూదన్, ఏఈ ప్రసాద్, పాల్గొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్య పనులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో చెత్త డంపింగ్ పాయింట్‌లు లేకుండా మెరుగైన పారిశుద్ధ్య పనులు జరిగేలా ప్రజారోగ్య కార్యదర్శులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. కంకరగుంట, బ్రాడీపేట, కోబాల్ట్ పేట, గోరంట్ల, అన్నపూర్ణ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం కమిషనర్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా చేయవచ్చని, అందుకు పిన్ పాయింట్‌గా పారిశుద్ధ్య పనులు జరిగేలా కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీతపై ఆధ్యాత్మిక ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నాలుగు రోజులు నిర్వహిస్తున్న శ్రీమద్భగవద్గీత 14వ అధ్యాయం గుణత్రయ విభాగయోగః ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ నుంచి సువీరానంద స్వామి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు అర్జునుడికి భగవద్గీతలోని అనేక అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కె.పూర్ణచంద్రరావు, రాధ దంపతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చిత్రలేఖనం ప్రదర్శనలో సత్తా చాటిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయస్థాయి చిత్రలేఖన ప్రదర్శనలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. శుక్రవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ డ్రీమ్ వర్క్ ఆర్ట్ గ్యాలరీ, అనంత డైమండ్స్, కేఎల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన ప్రదర్శన, వర్క్‌షాప్‌లో 80 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వారిలో సీతారామయ్య పాఠశాలకు చెందిన విద్యార్థులు 50 స్వర్ణ పతకాలతో పాటు, 20 రజత పతకాలు సాధించినట్లు వివరించారు. 10వ తరగతి విద్యార్థి డి. మోహన్‌కుమార్, 5 వ తరగతి విద్యార్థిని కామాక్షి బెస్ట్ చిల్డ్రన్ అవార్డు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన డ్రాయింగ్ టీచర్ వి.హేమలతకు బెస్ట్ టీచర్ అవార్డుతో పాటు బెస్ట్ స్కూల్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అదే విధంగా స్పాట్ పెయింటింగ్ పోటీలో ఎస్.కమల, ఎం.ఝాన్సీకి ఉత్తమ కళా శిక్షకురాలిగా బహుమతులు పొందారని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాద రావు గారు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్స్ డి.దుర్గా శ్యామ్, పి.శ్రీదేవి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

'ఎయిడెడ్' సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు దృష్టికి తీసుకువెళ్లినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు రికగ్నైజ్డ్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జేఏసీ ప్రతినిధులు శామ్యూల్ మోజెస్, బి.చిట్టిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిఎడ్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై మంగళగిరిలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో విజయ రామరాజు కలిసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని సమర్పించే విషయంలో జిల్లాస్థాయి అధికారులు హడావుడి చేస్తున్న విషయమై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, వివరాలు సమర్పించేందుకు నెల రోజులు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పాఠశాలలకు సంబంధించిన సమాచారం కోసం విద్యాశాఖాధికారులు రాత్రి వేళల్లో ఉపాధ్యాయులకు ఫోన్లు చేసే విషయంపై స్పందించిన కమిషనర్, ఇకపై అటువంటి ఫోన్లు ఉపాధ్యాయులకు చేయకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జేఏసీ నాయకులు దాసరి రామకృష్ణ, అనిల్ కుమార్ రెడ్డి, సుబ్బానాయుడు ఉన్నారు.

ఆ ఏసీపీపై అంత ప్రేమ ఎందుకో!

- ఏసీబీ కేసులున్నా ఫోకల్ పోస్టింగ్
- ప్రస్తుతం 16 వార్డులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏసీపీ
- 13 వార్డులు కూడా అదనంగా కేటాయింపు



నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ విభాగం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో రెండు ఏసీబీ కేసులో ఉన్న ఉద్యోగికి ఫోకల్ పోస్టింగ్ ఇవ్వకూడదని స్పష్టమైన ఆదేశాలున్నాయి.. కాని టీపీఓ(టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా) పనిచేస్తున్న ఫజిలూర్ రెహమాన్‌కు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ఏసీపీ(అసిస్టెంట్ సిటీ ప్లానర్) పోస్టింగ్ ఇచ్చి మరి నగరంలోని సగం వార్డులను అతడికి కట్టబెట్టడంపై ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. రెగ్యులర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఉన్నా ఆయనకు కేవలం ఆరు వార్డులే కేటాయించిన అధికారులు ఇన్‌చార్జి ఏసీపీ రెహ్మమాన్‌కు మాత్రం అత్యధికంగా 29 వార్డులు కేటాయించారు. దీంతో ఆ అధికారిపై అంత ప్రేమ ఎందుకని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

టీపీఓ మల్లికార్జున రిటైర్డ్ కాగా..

ప్రస్తుతం ఇక్కడ టీపీఓగా పనిచేసిన మల్లికార్జున గత కొద్ది రోజుల క్రితం రిటైర్డు అయ్యారు. ఆయన తూర్పు నియోజకవర్గంలోని 1, 2, 4, 47, 48, 50, 51, 52, 53, 54, 55, 56, 57 వార్డులకు టీపీఓగా పనిచేశారు. ఆయన రిటైర్డు కావడంతో ఆయన చేసిన వార్డులను కూడా ఇన్‌చార్జి ఏసీపీ రెహమాన్‌కు కట్టబెట్టారు. దీంతో ప్రస్తుతం మల్లిఖార్జున చూస్తున్న వార్డులతో పాటు పశ్చిమ నియోజకవర్గంలోని 32, నుంచి 49 వార్డుల వరకు కలిపి 29 వార్డులు కేటాయిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వార్డుల కేటాయింపుపై పోలీసు అధికారుల ఆరా..

రెగ్యులర్ ఏసీపీలు ఇద్దరు ఉన్నా వారిని కాదని ఇన్‌చార్జి ఏసీపీ రెహమాన్‌కు అత్యధికంగా 29 వార్డులు కేటాయించడంపై పోలీసు అధికారుల ఆరా తీస్తున్నారు. రెండు సార్లు ఏసీబీ కేసులు పెండింగ్‌లో ఉండగా ఫోకల్ పోస్టింగ్ ఇవ్వకూడదని స్పష్టమైన జీఓలు ఉన్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు రెహమాన్‌కు ఏ విధంగా ఫోకల్ పోస్టింగ్ ఇస్తారని.. ఇతని వలన ఆర్థిక దోపిడీ జరిగే ప్రమాదం ఉందని ఇతనిపై తగిన చర్యలు తీసుకోవాలని నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) ఏసీపీ ఉన్నతాధికారులు, ఎంఏయూడీ, డీటీసీపీకి, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. కాని నగరపాలక సంస్థ అధికారులు తిరిగి ఆయనకే అత్యధిక వార్డులు కేటాయించడంతో ఉన్నతాధికారులకు రెహమాన్ సమకూర్చే ఆదాయం ఉందో అని స్పష్టంగా అర్థమవుతోంది.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకుందాం

నగర ఇన్‌చార్జి మేయర్ సజీల



పుష్ కాట్స్‌ను అందజేస్తున్న తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ అధికారులు

నెహ్రూ నగర్: నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకోవడానికి నగర పాలక సంస్థ చేస్తున్న కృషిలో నగర ప్రముఖులు, వివిధ వ్యాపార సంస్థలు భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల కోరారు. శుక్రవారం తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు నగరపాలక సంస్థకు అందించిన 50 పుష్ కాట్స్‌ని కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు జీఎం అశోక్ కుమార్ కలిసి ప్రజారోగ్య కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్ఫూర్తితో గుంటూరు నగరాన్ని నగర ప్రజల సహకారంతో స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకుంటామన్నారు. నగరంలోని నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం, గార్బేజ్ పాయింట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర భాగంగా గుంటూరు నగరంలోని తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ వారిని ప్రజారోగ్య రక్షణలో కీలకమైన పారిశుద్ధ్య మెరుగుకు అవసరమైన పుష్ కాట్స్ కావాలన్న వెంటనే అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా గుంటూరు నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగానికి పుష్ కాట్స్ అందించడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

ఈ-శ్రమ పోర్టల్ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ్

లక్ష్మీపురం: అసంఘటిత కార్మికులకు అండగా ఉండేందుకు పెట్టిన సంక్షేమ పథకాల్లో భాగంగా ఈ-శ్రమ పోర్టల్ కింద గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో వారి నమోదుకు ఈ-శ్రమపోర్టల్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లేని వారు అందరు దీనికి అర్హులన్నారు. 2005 ఏప్రిల్ 7 నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేకంగా గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్స్ స్విగ్గి, జోమాటో, బ్లింకిట్, ఇన్‌స్టా కార్ట్, ఇన్‌స్టా మార్ట్ , అమెజాన్, ఫ్లిప్ కార్ట్ తదితర ఆన్‌లైన్‌లో ఆర్డర్స్ తీసుకుని సర్వ్ చేసే వారందరూ ఇందులో నమోదు కావాలని సూచించారు. ప్రస్తుతం జరుగుచున్న డ్రైవ్‌లో ఎక్కువమంది కార్మికులు నమోదు కావాలని కోరారు. ఈ-శ్రమ పోర్టల్ లో నమోదైన కార్మికులకు సంక్షేమ పథకాల్లో భాగంగా వారికి ప్రమాద మరణం కింద, ప్రమాదంలో కలిగిన శాశ్వత అంగవైకల్యంద కింద రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, ఎస్‌హెచ్‌ఓ వీరసోమయ్య

పట్నంబజారు: నగరంలోని ఆనందపేటలో వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్, పాతగుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య వివరాలు మీడియాకు వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన ఆనందపేట 2వ లైనులోని సమాధుల రోడ్డుకు చెందిన పఠాన్ ఖాజాబీ(70) అనే వృద్ధురాలు హత్యకు గురైన విషయం విదితమే. ఈ కేసులో ప్రధాన నిందితులైన అదే ప్రాంతానికి చెందిన షేక్ ఫైరోజ్, అతని సోదరుడు షేక్ ఫయాజ్‌లను ఈ నెల 8వ తేదీన పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు.

ఆనందపేట 2వలైను చెందిన చెందిన షేక్ అర్షద్, అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ.. ఆ అమ్మాయి నా లవర్ అని, ఆమె సోదరులు నా బావమరుదులు అని ప్రచారం చేస్తున్నాడు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న బాలిక సోదరులు షేక్ ఫైరోజ్, షేక్ ఫయాజ్, వారి స్నేహితులు లాలాపేట చౌత్రా సెంటర్‌కు చెందిన కేతవరపు నాగేంద్రబాబు అలియాస్ సన్నీ, లాలాపేట చిన్నబజార్‌కు చెందిన షేక్ ఆసిఫ్ అలియాస్ ఖాశీంలు ఈ నెల 3వ తేదీ ఉదయం 4.30 గంటల సమయంలో పొన్నూరు బారా ఇమాంపంజా మసీదు వద్ద టీ స్టాల్ వద్ద అర్షద్‌ను తీవ్రంగా కొట్టి, బ్లేడులతో గాయపరిచారు. అర్షద్ ఇంటికి వెళ్లి విషయాన్ని తల్లిదండ్రులు హసన్ అలియాస్ బాబు, తల్లి షాజహాన్ వివరించాడు. ఈ క్రమంలో వారు కొంత మందిని తీసుకుని వెళ్లి ఫైరోజ్, ఫయాజ్‌లఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులైన జాఫర్, వహీదాలను కొట్టారు. దీనితో ఫైరోజ్ తండ్రి జాఫర్ కుమారులకు సమాచారాన్ని అందించిన క్రమంలో తిరిగి ఫైరోజ్, ఫయాజ్, సన్నీ, ఆసిఫ్‌లు ఆనందపేటకు వెళ్లి అర్షద్ తల్లి షాజహాన్‌ను క్రికెట్ స్టంప్స్‌తో దాడి చేసి తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఆ కొద్దిసేపటి తరువాత అర్షద్ అమ్మమ్మ అయిన పఠాన్ ఖాజాబీ రాడ్లు, కర్రలతో తలపై గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వృద్ధురాలిని హతమార్చిన అనంతరం ఫైరోజ్, ఫయాజ్‌లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అర్షద్, అతని తల్లి షాజహాన్‌కు కాపలా ఉన్న అర్షద్ తండ్రి హసన్‌ను తీవ్రంగా కర్రలతో కొట్టి గాయపరచటంపై కొత్తపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఘటనలు అనంతరం నిందితులు అక్కడ నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు షేక్ ఫైరోజ్, ఫయాజ్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. కేసులో మరో ఇద్దరు నిందితులైన సన్నీ, ఆసిఫ్‌లు గురువారం రాత్రి బుడంపాడు బైపాస్ వద్ద ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

హైకోర్టు జడ్జి కె.మన్మథరావు



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి కె.మన్మథరావు, వేదికపై జిల్లా కోర్టు జడ్జి నాగరాజు



పూలే విగ్రహం నివాళులర్పిస్తున్న రాష్ట్ర రజక జన సేవ సంఘం నాయకులు

గుంటూరు లీగల్: జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే మహిళా విద్య కోసం చేసిన కృషి వెలకట్టలేదని చెప్పారు. అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రెండో జిల్లా కోర్టు న్యాయమూర్తి నాగరాజు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి చక్రపాణి, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళశెట్టి శివసూర్యనారాయణ హాజరయ్యారు. గుంటూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మోతుకూరి శ్రీనివాసరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

నెహ్రూనగర్: అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాన్ని అంకితం చేశారని ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే దంపతుల కృషి వలనే నేడు బాలికా విద్య పెరిగిందని చెప్పారు. అనంతరం హిందూ కాలేజీ కూడలి వద్ద ఉన్న జ్యోతిరావ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, ఎమ్మెల్యేలు నసీర్, గళ్లా

పూలేకు భారత రత్న ఇవ్వాలి

నెహ్రూనగర్: దేశంలో సామాజిక మార్పు కోసం అహర్నిశలు కృషి చేసిన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులకు భారత రత్న అవార్డు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజకజన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, పెనుమాక రమాదేవి, వట్టికూటి సాంబయ్య, వీరవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో

జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని కాకాని రోడ్డులోని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఏసుబాబు మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతోపాటు మహిళా విద్యాభివృద్ధి కోసం జ్యోతిరావ్‌పూలే నిరంతరం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు విజయ్, శ్యామ్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మజ్యోతిరావ్‌పూలే అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని హిందూ కాలేజీ కూడలి వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్: అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం తపించి వారి అభివృద్ధికి అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హిందూ కళాశాల కూడలిలోని ట్రావెలర్స్ బంగ్లాలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకట శేషగిరిరావు, కామేపల్లి వెంకటేశ్వర్లు, జితేంద్ర గుప్త, నాగరాజు, పరమేశ్వర రావు, శివరామకృష్ణ ప్రసాద్, శివన్ నారాయణ, ఓలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

గుంటూరు ఎడ్యుకేషన్: బడుగు, బలహీన వర్గాల ఉద్ధరణకు కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రరావు, ఎం.కళాధర్ పేర్కొన్నారు. శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మార్కెట్ సెంటర్లోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, సంఘ నాయకులు జి.శివపూర్ణయ్య, ఎం.గోవిందు, బి.ప్ర సాద్, సీహెచ్ ఆదినారాయణ, ఎం. కోటిరెడ్డి, ఎం.ధన రాజారావు పాల్గొన్నారు.

గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో..

లక్ష్మీపురం: మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను లక్ష్యాలను నేటితరం ముందుకు తీసుకెళ్లాలని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా 2/7 బ్రాడీపేటలోని విజ్ఞానకేంద్రం కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షత వహించారు. తొలుత పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వై.నేతాజి మాట్లాడుతూ మనువాదానికి వ్యతిరేకంగా గ్రామిక ప్రజలను చైతన్యం చేశారన్నారు. మహిళ విద్యకోసం ఎంతో కృషి చేశారన్నారు. పూలే స్ఫూర్తితో సామాజిక సమస్యల పరిష్కారంతో పాటు ఆర్థిక సమస్యలను కూడా మిళితం చేసి కార్మిక, కర్షకుల హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.నళినీకాంత్, జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణ రావు, నగర కార్యదర్శి బి.ముత్యాలరావు, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎస్.కె.సమీర్, ఎం.కిరణ్, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.



జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

నెహ్రూనగర్: దేశంలో సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావ్‌పూలే అని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పేర్కొన్నారు. జ్యోతిరావ్‌పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి, మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసి వారికి విద్యనందించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావ్ పూలే అని కొనియాడారు.



జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం

కాంట్రాక్ట్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేయాలి

ఐక్యవేదిక జిల్లా చైర్మన్ చాంద్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

గుంటూరు మెడికల్: కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ 2020ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్‌బాషా పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 30 సంవత్సరాలుగా కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేసినప్పుడల్లా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేయాలని కోరారు. మినిమం టైమ్ స్కేల్ వర్తింప చేస్తూ వస్తున్నారు, కానీ 2020 పీఆర్సీలో నేటి వరకు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, మోషెబాబు, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర శాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, కోశాధికారి శ్రీనివాస్, నగర శాఖ ఉపాధ్యక్షులు జాన్, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు(గుంటూరు): 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం డీ-3 సెక్షన్ పరిధిలో శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ మస్తాక్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. రైలుపేట, లాలపేట, ఆనందపేట, ఆర్‌టీసీ బస్టాండ్ రోడ్, కొత్తపేట, సాంబశివపేట, రైల్వేస్టేషన్ రోడ్, పొత్తూరివారి తోట, గుంటూరువారి తోట, గణేశ్వరరావుపేట, డీ-1 సెక్షన్ పరిధిలో అరండల్‌పేట, బ్రాడీపేట, కొరిటెపాడు, హనుమయ్య నగర్, రామన్నపేట, నాయుడుపేట, డీ-10 సెక్షన్ పరిధిలో పొన్నూరు రోడ్, లాంచస్టర్ రోడ్, బుడంపాడు, బైపాస్ రోడ్, ఐపీడీ కాలనీ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలాగే డీ-13 సెక్షన్(ఆర్‌టీసీ కాలనీ)లో 33/11 కేవీ మానససరోవరం ఎస్ఎస్ నుంచి వచ్చు 11 కేవీ ఫీడర్స్‌కు మెయింట్‌నెన్స్, చెట్ల తొలగింపుల కారణంగా నందివెలుగు రోడ్, గాంధీనగర్, ఆర్‌టీసీ కాలనీ, షాప్ ఎంప్లాయీస్ కాలనీ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాను ఉండదని ఈఈ పీహెచ్ హుస్సేన్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బ్రాడీపేట పరిధిలో..

కొరిటెపాడు(గుంటూరు): 11 కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించుట, లైన్ మెయింటెనెన్స్ దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ నిలిపివేయనున్నట్లు డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 1/14 నుంచి 6/18 వరకు, లక్ష్మీపురం, చంద్రమౌళినగర్, పండరీపురం, అశోక్‌నగర్, దేవపురం, కృష్ణనగర్, కోబాల్ట్‌పేట, పట్టాభిపురం తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అలాగే 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినోబానగర్, మారుతీ నగర్, జాకీర్ హుస్సేన్ నగర్, ఎల్బీనగర్, బీఆర్ స్టేడియం అంకమ్మ తల్లి గుడి, భావోజీ మఠం, ఆలీ నగర్, ముగ్దుమ్ నగర్, చెన్నంవారి వీధి, క్రిస్టియన్ పేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని టీ-4 డీఈఈ పీహెచ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మోదీ విధానాలు వినాశకరం

– సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అంజయ్‌కుమార్

లక్ష్మీపురం: ప్రధాని నరేంద్ర మోదీ విధానాలు రోజురోజుకు వినాశకరంగా మారిపోతున్నాయని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఛత్తీస్‌ఘడ్‌లో నక్సలైట్ల ఊచకోత మానవత్వానికే మాయని మచ్చలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం కోసమే ఈ దారుణానికి మోదీ ఒడిగట్టారని విమర్శించారు. ముస్లిం ప్రజల అభ్యున్నతి కోసం, ప్రార్థనా మందిరాల కోసం కేటాయించిన లక్షలాది ఎకరాల వక్ఫ్ భూములను కూడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును రాజ్యసభలో దుర్మార్గంగా పాస్ చేసిన మోదీ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేసిందని మండిపడ్డారు. ఆదర్శభావాలు కలిగిన జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమాలు ప్రతి జిల్లాలో ప్రభుత్వం నిర్వహించాలని జంగాల డిమాండ్ చేశారు.

నేడు గుంటూరుకు నారాయణ

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా గుంటూరులో శనివారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ హాజరు కానున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. ఉదయం 10 గంటలకు గుంటూరు మల్లయ్యలింగంభవన్ నుంచి మాయాబజార్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన అనంతరం జీఓలు దగ్ధం చేయడం జరుగుతుందన్నారు.

గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

నెహ్రూ నగర్: గంజాయి కలిగి ఉండడంతో పాటు, తాగుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ 1 టౌన్ సీఐ బి.లత తెలిపారు. పొన్నూరు రోడ్డులో కరెంట్ ఆఫీస్ వెనక, నాయీ బ్రాహ్మణ కాలనీలో గంజాయి తాగుతున్న షేక్ సుభాని, షేక్ ఖాజాలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 80 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు కె.షరీఫ్, పి.తిరుమలేశ్వర రావు పాల్గొన్నారు.